# సింగిల్ పేజీ కథలు

## అపకారికి ఉపకారము..

**ఎప్పుడూ లేనిది బెడ్‌మీద లేచి కూర్చొని న్యూస్‌పేపర్ తీశాడు కొండల రావు. ఎప్పుడు తెల్లారుతుందా, ఎప్పుడా వార్త పేపర్లో చూద్దామా అని రాత్రంతా ఒకటే ఆత్రుత.**

'రోడ్డు ప్రమాదంలో యువకుని దుర్మరణం!'

ఆ వార్తకోసం ఆత్రంగా వెదికాయి అతని కళ్లు. కానీ చిత్రంగా ఆ వార్త అలా రాలేదు. చివరిక్షణంలో ఎవరో వచ్చి హాస్పిటల్‌లో చేర్చడం వల్ల ప్రాణాపాయం నుంచి బయటపడినట్టుగా ఉంది. అందుకే విసిరికొట్టాడు పేపర్‌ని.

ఆశాభంగంతో అతలాకుతలమైపోయిందతని మనసు. అసహనంగా లేచి గదిలోనే అటూ ఇటూ పచార్లు చేస్తూ ఆలోచనలోపడ్డాడు.

'ఎలా జరిగింది? ఎవరు కాపాడారతన్ని?'

అతని ఆలోచనల్ని భగ్నం చేస్తూ టెలిఫోన్ మోగింది. వెళ్ళి అందుకొని "హలో" అన్నాడు.

"కొండలరావు, నేను వీరభద్రాన్ని. నీకెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలీడం లేదు. మా ఒక్కగానొక్క కొడుకు ప్రాణాల్ని కాపాడావు"

కొండలరావు ఉలిక్కిపడ్డాడు. ఇది ఊహించని విషయం. తాను రక్షించడమేమిటి? వాడు చావనందుకు బాధపడుతూంటే!

వీరభద్రం ఫోన్‌లో ఇంకా చెప్పుకుపోతూనే ఉన్నాడు. "మనిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందన్న సంగతి మన ఊళ్ళో వాళ్ళందరికీ తెలుసు. అలాంటిది మా వాణ్ణి రక్షించి నువ్వు దేవుడికన్నా గొప్పవాడివైపోయావు. నాకు చాలా ఆనందంగా ఉందీ రోజు. ఏళ్ళ తరబడి మన కుటుంబాల మధ్య రగులుకుంటూన్న పగ, ప్రతీకారాలు ఎంత అర్థం లేనివో, ఆలోచిస్తే ఇప్పుడర్థమవుతోంది. వాటికి ముగింపు పలికిన గొప్పదనం నీకేదక్కుతుంది. నీ మంచితనంతో నన్ను ఓడించేసావు. గెలుపునీదే"

ఫోన్ పెట్టేసాకా దీర్ఘాలోచనలో పడిపోయాడు కొండలరావు. బద్ధశత్రువు తనని దేవుడికన్నా గొప్పవాడినని పొగుడుతూ ఉంటే గుండె లోతుల్లో ఎక్కడో తెలీని స్వాంతన. లోలోపల రగిలి సెగలవుతూన్న అహం కొద్దిగా శాంతించిన భావన!

కానీ ఎలా జరిగిందిలా! నిన్న జరిగిన సంఘటన మరొక్కసారి గుర్తు తెచ్చుకున్నాడు.

కారుమీద పొరుగూరు వెళ్ళి వస్తూంటే రోడ్డుకడ్డంగా పడి ఉన్నాడొక యువకుడు, రక్తపుమడుగులో! ఏదో వాహనం అతన్ని ఢీకొని ఆగకుండా వెళ్ళిపోయినట్టుంది.

కారాపి దగ్గరికి వెళ్ళి చూసాడు. అతని ముఖం చూడగానే ఆశ్చర్యపోయాడు. ఆ యువకుడెవరో కాదు-

ఏ వ్యక్తి పేరు తలిస్తే తన శరీరంలోని నరనరాలు ఆవేశంతో బిగుసుకుంటాయో, ఏ వ్యక్తి గురించిన ఆలోచనలు రాత్రిపూట పీడకలలై నిద్రాభంగం చేస్తాయో, ఆ వీరభద్రం కొడుకు! తన బద్ధశత్రువు కొడుకు!

చావు బతుకుల్లో ఉన్నది శత్రువు కొడుకు. చస్తే తనకేం? ఆ మాటకొస్తే వాడు చావాలి. తన పగ చల్లారే రోజు ఈ విధంగా వచ్చిందన్నమాట.

వెళ్ళబోతుండగా..ఎవరో కుర్రాడొచ్చాడక్కడికి. బైక్ రోడ్డు వారగా నిలబెట్టి "అరెరె.. ఏక్సిడెంట్" అనుకుంటూ దగ్గరికి వచ్చి చూసాడు. గాయపడిన యువకుని జేబులోంచి బయటికి తొంగి చూస్తూన్న టెలిఫోన్ డైరీ తీసి అందులోంచి ఒక నెంబర్ నోట్ చేసుకున్నాడు.

దగ్గర్లో ఉన్న టెలిఫోన్ బూత్‌వైపు పోనిచ్చాడు తన బైక్‌ని. కనీసం కిలోమీటర్ దూరమైనా ఉంటుందది. కొండలరావు తన కారులో అతన్ని అనుసరించి వెనకే వెళ్ళాడు.

కారు పార్క్ చేసి బూత్‌లోకి ప్రవేశించి కుర్రాడి చేతిలోంచి ఫోన్ బలవంతంగా లాక్కున్నాడు. "అర్జంటు విషయం మాట్లాడాలి. ముందు నన్ను మాట్లాడనియ్" అంటూ తన ఇంటికి ఫోన్ చేసి పిచ్చాపాటి కబుర్లు చెప్పసాగాడు.

అతడి ముఖంలో పైశాచిక ఆనందం తొణికిసలాడుతోంది. వింటూన్న కుర్రాడు అతనివైపు చిరాకుగా చూసి మరో బూత్‌వైపు పరుగుతీసాడు.

అప్పుడు కొండలరావు మరో నెంబర్‌కి డయల్ చేసాడు. ఆ నెంబర్ వీరభద్రం ఇంటిది. లైన్ కలవగానే గొంతుమార్చి ఏవేవో సంబంధం లేని మాటల్ని కల్పించుకుంటూ అపరిచిత వ్యక్తిలా మాట్లాడసాగాడు. కేవలం ఆ నెంబర్‌ని 'ఎంగేజ్'లో ఉంచడానికే!

కాస్సేపటికి ఆ కుర్రాడు విసుగ్గా బైక్‌స్టార్ట్ చేసి వెళ్ళిపోవడం గమనించాడు. అయినా అరగంట సేపు అలాగే వీరభద్రం ఇంటి నెంబర్‌ని 'ఎంగేజ్'లో ఉంచాడు. అంటే అంతసేపూ ఎవరూ వీరభద్రం ఇంటికి ఫోన్ చేసి ఏక్సిడెంట్ అయిన సంగతి తెలియజేసే అవకాశం లేదు!

మరి కథ ఇలా బెడిసి కొట్టిందేమిటి? అనుకున్నాడు.

కాస్సేపటికి ఇంటిముందు కోలాహలం వినిపించి ఏమిటాని బయటి కొచ్చి చూసాడు. అరడజను కార్లు వచ్చి ఆగాయి. అందులోంచి మందీ మార్బలంతో వీరభద్రం వెనుకే అతని అనుచరుల చేతుల్లో స్వీట్లు, పళ్ళు, ఏవో గిఫ్ట్‌పేకెట్లు!

వచ్చీరాగానే కౌగలించుకున్నంత పని చేసాడు వీరభద్రం.

వెంట తెచ్చిన బహుమతులన్నీ తానే స్వయంగా అక్కడ ఉంచి "తాజాగా మొదలైన మన స్నేహానికి గుర్తుగా ఈ చిరుకానుకలు" అన్నాడు వీరభద్రం.

కొండలరావుకి నోట మాట రావడం లేదు. కటిక చీకటిలో ఒక్కసారిగా ధగద్ధగాయమానమైన వెలుగు పరచుకుంటే కలిగేలాంటి వింత విభ్రాంతితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. అతనికీ ఆనందంగానే ఉంది. కనిపిస్తే కత్తిదూసే శత్రువు హఠాత్తుగా ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని దాసోహమంటుంటే అతనిపై విజయం సాధించకుండానే, సాధించిన అనుభూతి కలుగుతోంది.

అయితే ఎందుకిలా జరిగిందో మాత్రం ఊహించలేకపోతున్నాడు.

"మరి వెళ్ళొస్తాను కొండలరావు. మన స్నేహం ఇలాగే కలకాలం కొనసాగాలని ఆశిస్తున్నాను" అంటూ వెళ్ళబోయాడు వీరభద్రం. కొండలరావు ఏమీ మాట్లాడలేదు. ఏం మాట్లాడాలో కూడా తోచడం లేదతనికి.

"నాన్నగారూ! వాళ్ళని భోంచేసి వెళ్ళమనడం బాగుంటుందేమో!" కొడుకు శ్రీరాం మాటలు వినిపించి ఈ లోకంలోకి వచ్చాడు. అప్పుడు పెగిలిందతని నోట మాట.

"అవునవును. రాక రాక వచ్చారు. భోంచేసి వెళితే బాగుంటుంది. ప్లీజ్ కాదనకండి" అన్నాడు కొండలరావు. అన్నాడేగానీ అమితంగా ఆశ్చర్యపోయాడు. తానేనా ఆ మాట అన్నది?

వీరభద్రం, అతని పరివారమంతా ఆరోజు అక్కడే భోం చేసారు. అంతా వెళ్ళాక పడక కుర్చీలో విశ్రాంతిగా పడుకుని కళ్ళు మూసుకున్నాడు కొండలరావు.

"నాన్నగారూ! మీరు నన్ను క్షమించాలి" ఎదురుగా నిలబడ్డాడు శ్రీరాం.

# స్వరావళి 21

## (సరిగమపదని కేళి)

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ద | | | ప | కే | రి | | | ళి |
| | కే | | ళి | | | | | |
| మ | ళి | | స | | ద | | కే | గ |
| స | రి | | ని | | కే | ళి | గ | ప |
| | | ళి | | | | మ | | కే |
| గ | ద | కే | మ | | ళి | | రి | స |
| ని | | | ద | | మ | కే | ళి | రి |
| ళి | | | కే | | | | | |
| కే | | | గ | ళి | ని | | | ద |

## ఆటాడుకుందాం రండి!

**'సుడోకు'** అనే సరికొత్త అంకెల క్రీడ అమెరికాలో పుట్టి జపాన్ ద్వారా ప్రాచుర్యం పొంది, ప్రస్తుతం మన దేశంలోనూ వేగంగా పాకిన విషయం మీకు తెలుసు. గణితానికి భారతదేశం ప్రపంచానికి కానుకగా ఇచ్చిన సున్న '0' మాత్రం 'సుడోకు'లో లేదు.

కాబట్టి అంకెలను వదలి అక్షరాలతో 'సుడోకు'ను దేశీయంగా మలచాలని రూపొందించిందే ఈ 'స్వరావళి'. సప్తస్వరాలయిన స రి గ మ ప ద ని లను కేళిగా మలుచుకుని సాగే క్రీడ ఇది. 1 2 3 4 5 6 7 8 9 అనే అంకెల స్థానంలో 'స రి గ మ ప ద ని కే ళి' అనే అక్షరాలు ఈ స్వరావళిలో ఉంటాయి.

★ మీరు మొదట గమనించవలసింది ఏమిటంటే ఈ స్వరావళి పజిల్‌లో మొత్తం 9 పెద్ద గళ్ళు ఉన్నాయి. తిరిగి ఒక్కొక్క పెద్ద గడిలో 9 చిన్న గళ్ళున్నాయి.

★ ఒక్కొక్క పెద్ద గడిలోని 9 చిన్న గళ్ళలో మీరు **సరిగమపదని** అనే అక్షరాలు వేయాలి. **కేళి** అనే రెండక్షరాలు ఎక్కడుంటాయో మేమే ఇచ్చాం. అవి కాక ఇపుడున్న అక్షరాలను మార్చకూడదు. ఒకసారి వచ్చిన అక్షరం (స్వరం) మళ్ళీ రాకూడదు.

★ ఇదే తరహాలో పెద్దగళ్ళు తొమ్మిదింటినీ నింపాలి.

★ ఆ తర్వాత పూర్తి పజిల్‌లో నిలువుగా వున్న 9 చిన్న గళ్ళను అడ్డంగా వున్న 9 చిన్న గళ్ళను చూడండి. నిలువుగా అడ్డంగా అన్ని వరుసలూ చూడండి. ప్రతి వరుసలో ఏదో విధంగా 'సరిగమపదనికేళి' అని అన్ని అక్షరాలూ ఉండాలి. ఏ వరుసలో కూడా వచ్చిన అక్షరం మళ్ళీ రాకూడదు. అక్షరాల గారడి ఆడండి మరి!

**నిర్వహణ: సుధామ**

స్వరావళి-21 పూరణం 79 వ పేజీలో చూడండి.

"ఎందుకురా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"వీరభద్రం కొడుకుని హాస్పిటల్‌లో చేర్చింది నేనే"

ఒక్క ఉదుటున నిటారుగా లేచి కూర్చున్నాడు కొండలరావు.

కొడుకామాట వీరభద్రం వచ్చి వెళ్ళకముందు గనక చెప్పి ఉంటే ఏకంగా గొంతు పిసికి చంపేసేవాడేమో. ఇప్పుడంతగా ఆవేశం కలగడం లేదతనికి.

నా ఫ్రెండొకడు వీరభద్రం ఇంటికి ఫోన్ చేయబోతూంటే ఎవడో ఉన్మాది అడ్డుపడ్డాడట. వేరే బూత్ నుంచి చేయబోతే చాలాసేపు 'ఎంగేజ్‌టోన్' వచ్చిందట. అందుకే మనింటికి ఫోన్ చేసి నా సహాయం కోరాడు. నేను వెళ్ళి చూస్తే అక్కడ పడి ఉన్నది వీరభద్రం కొడుకే. మీ మధ్య ఉన్న శత్రుత్వం గురించి నాకు తెలుసు. కానీ దానికి అభం శుభం తెలీని అమాయకుడు బలికాకూడదు కదా..అందుకే వాణ్ణి మేము హాస్పిటల్‌కి చేర్చాము" అన్నాడు శ్రీరాం.

కొండలరావుకో సందేహం కలిగింది. అలా అడ్డుపడిన 'మానవత్వం లేని ఉన్మాది' తానే నన్న సంగతి కొడుక్కి తెలిసే మాట్లాడుతున్నాడో, తెలీక మాట్లాడుతున్నాడోనని..

"ఇందులో క్షమించడానికేముంది?" అన్నాడు గిల్టీఫీలింగ్ కలగలిసి నెమ్మదించిన స్వరంతో.

"అబద్ధం చెప్పినందుకు" అన్నాడు శ్రీరాం.

"అబద్ధమా?"

"అవును నాన్నగారూ! వీరభద్రం కొడుకు గాయాలతో పడి ఉండడాన్ని మొదట చూసింది మీరేననీ, అతన్ని హాస్పిటల్‌లో చేర్పించడానికి మీరే నన్ను పంపించారని హాస్పిటల్ వాళ్ళు అడిగినప్పుడు చెప్పాను. మనలో ఎవరే మంచిపని చేసినా చెడుపని చేసినా ఇంటి యజమానిగా దానికి బాధ్యత మీదేనన్న ఉద్దేశ్యంతో అలా చెప్పాను. మీ అనుమతి లేకుండా చెప్పాను కదా. అందుకే క్షమించమంటున్నాను" అన్నాడు శ్రీరాం.

కొండలరావు ఏమీ మాట్లాడలేకపోయాడు.

"తరాలు మారుతున్న కొద్దీ మానవతా విలువలు కూడా మారుతూ ఉండాలి నాన్నగారూ. శత్రువుపై విజయం సాధించాలని మీరనుకుంటారు. శత్రుత్వంపై స్నేహంతో విజయం సాధించాలని మేము అనుకుంటూ ఉంటాము" అంటూన్న కొడుకువైపు అపరాధ భావంతో చూస్తుండిపోయాడు కొండలరావు.

**-పనుపులేటి తాతారావు (భువనేశ్వర్)**